


శ్రీ దేవేంద్ర సత్యార్థిగారు జానపద గేయ సంపాదనార్థమై, యావద్భారత దేశము తిరుగుతూ, 1939 వ సంవత్సరములో తెలుగునాటికి వచ్చారు. రాజమహేంద్రవరములో రెండు నెలలున్నారు. ప్రతిదినము నావద్దగల "ఆంధ్ర వాఙ్మయము"లోని ముద్రితాముద్రితములను చదివించుకొంటూ, వివరణలు అడుగుతూ ఉండేవారు.

ఆ సందర్భములో, "వాల్మీకి మహర్షి ఊర్మిళాదేవి విషయములో పొరపడ్డారు" అని శ్రీ ఠాకూరుగారు తమతో చెప్పినట్లుగా, నాతో శ్రీ సత్యార్థిగారన్నారు. అప్పుడు నేను, స్త్రీల పాటలలోగల "ఊర్మిళాదేవి నిద్ర" చూపించి, "మా తెలుగు జానపదకవులు వాల్మీకిమహర్షి పొరపాటును దిద్దినారు" అంటూ ఆపాట అంతా చదివి, నాకు తోచినరీతిని దానిలోని స్వారస్యాన్ని వివరించాను. వారు ఈ పాటను నా వ్యాఖ్యసహితంగా ఇంగ్లీషులో వ్రాసుకొన్నారు.

1942 సం॥ జనవరినుండి, ఏప్రియలు నెల వరకు "మోడరన్ రివ్యూ" అనే పత్రికలో శ్రీ సత్యార్థిగారు విపుల వ్యాఖ్యానంతో వాటిని ప్రకటించారు.

వాల్మీకిమహర్షి నాటి నుండి పాపమూ ఊర్మిళాదేవికి కావ్యములలో న్యాయముగా ఈయవలసినంతటి ప్రాముఖ్య మీయలేదని వాదించిన శ్రీ సత్యార్థిగారికి జోహారు లర్పించవలసివున్నది.

సీతాదేవితోబాటు ఊర్మిళాదేవికూడ వనవాసానికి వెళ్ళివుంటే కథ మార్పుచెంది వుండేది. లక్ష్మణుడు ఆమెను వద్దన్నాడు. పతియాజ్ఞ పాటించి, ఆ పతివ్రతామతల్లి ఇంటనే వుండిపోయింది. ఆ పదునాలుగేండ్లూ ఆమె కన్నులుమూసి పవళించింది. రావణుని వధానంతరము, శ్రీరామచంద్రుడు, సీతాలక్ష్మణుల తోను, సైన్యముతోను అయోధ్యకు చేరుకొన్నాడు. అప్పుడు ఆయనకు పట్టాభిషేకం సర్వాంగీకారంగా జరిగింది. తన చెల్లెలినిగూర్చి సీతాదేవి ప్రస్తావించింది. ఇందులో తన స్వాతంత్ర్యమును, లలితహృదయమును గోచరింపజేసింది చూడండి:

"శ్రీరామభూపాలుడు । పట్టాభి
షిక్తుడై కొలువుండగా.

## నేదునూరి గంగాధరం

... ... ... ... ... ... ... ...
సభయంత కలయజూచి । ఏతెంచి ।
సంతోషమున జానకి
పతిముఖముజూచి నిలచి । వినయమున ।
పట్టి అంజలి గ్రక్కునా
దేవాదిదేవ వినుమా । ఒకమనవి ।
తెలిపెను చిత్తగింపుమా
ముందు మన మడవులకును । పోగాను ।
ముద్దుమరది వెంటను
శయనమయి రాగ జూచి । తనచెలియ ।
శయనమాయెను ఊర్మిళా
'వద్దు నీవుండు' మనుచూ । లక్ష్మన్న ।
మనల సేవింపవచ్చె
నాడుమొదలూ నేటికీ । కనుమూసి ।
నాతి పవళించియుండె
ఇకనైన ఆనతిచ్చి । తమ్ముణ్ణి ।
ఇందుముఖి కడ కంపుడీ"

సీతాదేవి, శ్రీరామచంద్రునకు గతచరిత్రను, ఊర్మిళాదేవి నియమనిష్ఠను విన్నవించి లక్ష్మన్నను ఊర్మిళదగ్గరకు పంపవలసిందని ప్రాధేయపడుతూ, తన చెల్లెలియందలి వాత్సల్యమును ప్రకటించుకొంటుంది. అంత లక్ష్మణుడు ఊర్మిళ మందిరానికి వెళ్లాడు:

"కేళీగృహముజొచ్చియు । లక్ష్మన్న ।
కీరవాణిని జూచెను
ప్రాణనాయకిపాన్పునా । కూర్చుండి ।
భాషించె వీరవాముడు"

ఊర్మిళాలక్ష్మణుల సంభాషణ అత్యంత రమణీయంగా ఉంటుంది. సౌందర్యవతీమణి పాతివ్రత్యప్రభావమును ఉట్టంకిస్తుంది ఊర్మిళాదేవి. మొదట ఆయమ్మ కన్నులైనా తెరవలేదు; పరపురుషుడని ఎంచి ప్రతిన పాటించి:

"అయ్య మీరెవ్వరయ్యా । ఈరీతి ।
యాగడమ్ములకా సిరీ
ఎవ్వరూ లేని వేళ । మీరిపుడు ।
ఏకాంతములకా సిరీ
మాతండ్రి జనకరాజు । విన్ననూ ।
యాజ్ఞసేయక మానరూ
మాయక్క బావ విన్నా । మీకిపుడు ।
ప్రాణముకు హానివచ్చు
మాయక్క మఱది విన్నా మిమ్మిపుడు ।
బ్రతుకనివ్వరు జగతిలో"

పరపురుషుణ్ణి పతివ్రతలు భయపెట్టే విధానం, ముందుగా తండ్రిగారిని, తరువాత బావగారిని ప్రస్తావించి ఆనక భర్త అవలే "మా అక్క మఱది" అని ఎంతసున్నితముగా వచియించిందో ఇందులో పుట్టింటి అభిమానం, బావగారి యందలి భక్తి, భర్తను తలచుటలోగల లజ్జామాధుర్యము గమనింపదగినవి.

ఆ తరువాత—

"ఒకనాటి గౌరి గాదా । ఇంద్రునికి ।
మొదటెల్ల హే వమూరో

# ఊర్మిళ నిద్ర

ఇట్టిద్రోహములు మీరు। ఎరుగుండి।
ఇంతద్రోహముకొస్తురా"

అని మంచిగా హితవుచెప్పింది. తుట్టతుదకు,

"ఆడతోడబుట్టరా। మాకంటె।
తల్లి లేదా మీకును"

అని దీనముగా వేడుకొన్నది. లక్ష్మణుని జవాబులు చాల శాంతముగను, సామాన్యముగను ఉన్నవి.

"జనకులల్లుని గానలేకి చేడరో।
సీతమఱదిని గానలే!"

అంటూ తన్నుతాను చెప్పుకొన్నాడు. అయోధ్యను విడిచి వెళ్ళినతరువాత, జరిగిన కథ అంతా క్లుప్తముగా చెప్పి, పదునాలుగేండ్ల ఎడబాటుతో తను పడిన విరహము తెలియచెప్పుకొన్నాడు. భర్త అని తెలిసి కొని, ఊర్మిళ కళ్ళు తెరచిచూచి, తత్తరపడి లేచి, పతిపాదములకు ప్రణమిల్లింది. పరస్పరాలోకనములు, ఆలింగనములు అయిన తరువాత ఊర్మిళ కొంచెం కోపంతో, కొంచెం కన్నీళ్ళతో, భర్తను చూచి—

"మాతండ్రి జనకరాజు। మిమునమ్మి।
మరచి కల్యాణమిచ్చె
మానావతల్లుడనుచు। తెలియక।
మదిని యుప్పొంగుచుండె
చిత్త మొకదిక్కునుంచి। సమయమున।
చిన్నబుత్తురు ఇంతులా"

అంటూ తన వేదనను ముద్దుముద్దుగా వెళ్ళబుచ్చుకుంది. ఎంత సమంజసముగా ఉందో గ్రహించండి. సకల శుభలక్షణమూర్తి, లక్ష్మణుడు,

"తరుణి పదునాలుగేండ్లు। నినువిడిచి।
ధరియిస్తినే ప్రాణము
ఆహారనిద్రలూను। యెరుగనే।
అతివ నీమీద యాన
పుణ్యపురుషులస్త్రీలను। ఎడబాపిన।
పూర్వజన్మమున మనము
ఎన్నెన్ని యుగములైన। ఇది మనకు।
అనుభవించక తీరదు"

అంటూ, పూర్వజన్మ కర్మలను ప్రస్తావనకు తెచ్చి, భార్యను ఓదార్చాడు. ఈ దంపతులకు, పదునాలుగేండ్లకు ఇదే మంగళస్నానమంటూ, కౌసల్య ఆజ్ఞప్రకారం తలంటుస్నానాలు చేయించారు. తరువాత ముస్తాబులు.

"బంగారుపూలపట్టు। ఊర్మిళా।
బాగుమీరా గట్టెను
కోటిసూర్య 'దీప్తి'తో। వెలిగేటి।
మేలయినరవికె దొడగ
... ... ... ... ... ... ......"


# మెరయుచు పొంగే ఈనో

## కడుపులోని అస్వస్థతలను ఎనిమిది సెకెండ్లలో పోగొట్టును!



అజీర్ణము, గుండెమంట లేక కడుపు ఉబ్బరం, ఏదయినా దీనితో ఉపశమనము కలుగును!

ఒక గ్లాసెడు మెరయుచు పొంగే ఈనో ఫ్రూట్ సాల్ట్ మీరు పుచ్చుకుంటే ఎనిమిది సెకెండ్లలో మీ కడుపులోని అస్వస్థత నయమగును. మీరు పరకడుపున కొంచెము ఎక్కువ మోతాదు త్రాగితే, ఈనో సౌమ్యముగ, నిశ్చయమైన గుణము కలిగించే విరేచనముల మందుగా పనిచేయును. ఎల్లప్పుడూ ఈనో ఒక సీసా మీ యింట్లో ఉంచుకోండి.

## ఈనో 'ఫ్రూట్ సాల్ట్'

ఆమ్ల నిరోధకమైన మెరయుచు పొంగే పానీయము

ఈనో' మరియు 'ఫ్రూట్ సాల్ట్' అను మాటలు రిజిస్టరు చేయబడిన ట్రేడు మార్కులు

మోసగించుటకు
వీలులేకుండా
సీలుచేయబడిన
క్రొత్త సీసాలలో
యిప్పుడు
అమ్మకమునకున్నది
(2 సైజులలో దొరకుతోంది)




గ్రూప్ లేబొరెటరీస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్.

ముత్యాల తిరుచూర్ణము। లక్ష్మన్న।
ముద్దుముఖమున దీర్చెను
రత్నాల కంఠమాలా। లక్ష్మన్న।
రంజిల్ల ధరియించెను"

ఆ లు మ గ లిలా అలంకరించుకొన్నారు. పిమ్మట—

"వెలలేని మాణిక్యము। పతికూడి।
నిలువుటద్దము జూచెనూ
సిగ్గుపడి శిరసొంచుకొ। ఊర్మిళా।
చిరునవ్వుతో నిలచెనూ"

ఎచ్చటనుండి వచ్చాయో, ఊర్మిళాదేవికి సిగ్గుదొంతరలు! ఇది స్త్రీస్వభావం. తరువాత మృడసోపేతమైన భోజనాలు చేశారు. ఇంతటినుండి "శాంతమ్మ-సీతమ్మ"- అంటే, వదినా మరదళ్ళ సరసాలు ప్రారంభం—

"చెడే వినవే జానకీ। నీచెలియ।
యూర్మిళా బుద్ధులన్నీ
ధమిడిపానుపున సొలసి। యుండె నొక।
పదునాలుగేండ్లు పడతీ
కుందనపు ప్రతిమకళలు। ఈకళ।
ఎందుండి దాగున్నదో
దృష్టితగులాకుండను। నీలాల।
నివ్వాళు లివ్వరమ్మా"

అంటూ సరసోక్తులాడే శాంతతో సీత, వినయముతో సరసాలు ప్రారంభించింది. కన్నకుమారునిపట్ల చూపే గారాబముతోను, ముద్దుమరది యనెడి మన్ననతోను "అన్న! లక్ష్మణా! నాయనా!" అంటూ పిలిచే మాతృప్రేమతో, మరదిని వెనకేసుకొచ్చి అడబడుచుకు సమాధానం చెప్పింది సీతమ్మ.

"ఇంద్ర చంద్రాదులాను। వలపించు।
చంద్రులూ మీ తమ్ములూ
దృష్టితగులాకుండను। నీలాల।
నివ్వాళు లివ్వరమ్మా"

మఱదిని వెనకేసుకొచ్చిన సీతకు శాంత జవాబు:

"అక్కచెల్లెండ్రు మీరు। మిక్కిలి।
సౌందర్యశాలులమ్మా
మా తమ్ములా నలుగురీని। వలపించు।
జాణలకు దృష్టితగులూ"

అవ విని సీత చిరునవ్వుతో

"మాయన్న ఋష్యశృంగు। మనసులో।
కూడి ఎడబాయకున్న
యేమి యెరుగని తపసిని। ఓ వదినె।
కెలించి విడచినావు"

అంటుంది. ప్రయ్యలు పడకుండ, సెయ్యంబున, తియ్యగా జరిగిన ఈ వదినామరదళ్ళ సంవాదం వింటే, మనము ముగ్ధులం కావలసిందే.

ఊర్మిళా లక్ష్మణులు శయ్యాగృహం చేరాక ముచ్చటలు:




స్వతంత్రభారతి —ఎ. బి. శంకరశాస్త్రి

'కీలుకొప్పమర విడిచి। లక్ష్మణుడు।
నేర్పుతో జడలల్లెను
బొడ్డు మల్లెల జాజులు। జడపయిని।
శృంగారముగ జుట్టెను
తాంబూలములు నములుతూ। దంపతులు।
కలిపిముచ్చటలాడుచూ'

ఈ సమయమున ఊర్మిళ సంతోషముగా ఉంటుంది. భర్తతో ముచ్చటలాడుచు, తన అక్క చెరబోయినవిధము చెప్పుమని భర్తను మృదుమధురముగా అడుగుతుంది.

"రామలక్ష్మణులు మీరూ। ఉండగా।
రమణెట్లు చెరబోయెనూ?
సింహవిక్రములుమీరూ। ఉండగా।
సీతెట్లు చెరబోయెనూ?
రాజ్యాధిపతులుమీరు। ఉండగా।
రమణెట్లు చెరబోయెనూ?"

భార్య ప్రశ్నపరంపరలకు, జవాబు ఏమి చెప్పాలో, ఎలా చెప్పాలో లక్ష్మన్న ఆలోచించేడు. అయోధ్య విడిచినది మొదలు తిరిగి చేరుకొనేవరకు జరిగిన కథను పూసగ్రుచ్చినట్లు చెప్పేడు. ఈ పాటకు ఫలశ్రుతి కూడా ఉంది.

"ఊర్మిళా విరహమ్ములూ। ఇదిఎవరు।
పాడినా, విన్నగాని
శ్రీ విష్ణు కైవల్యము। సౌమిత్రి।
విష్ణులోకము నిచ్చునూ"

ఈ విధంగా ఈ పాట ముగింపబడింది. నాచేతనైనంతవరకు, ఈవిధముగా యత్నించి అందలి యొప్పులను, తప్పులను సహృదయులకే అప్పగించి, నేను తప్పుకొనుచున్నాను. ★